## క్లుప్తంగా

### బీఆర్‌ఎస్‌లో చేరిక



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన శంకరయ్య

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పి.శంకరయ్య బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఖానాపూర్ గ్రామానికి చెందిన శంకరయ్యతోపాటు శ్రీకాంత్, సత్యకుమార్, శివరాజ్‌గౌడ్‌కు ఎమ్మెల్యే మంచిరెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్, రవీందర్, ప్రవీణ్, విద్యాసాగర్, రాంబాబు, చంద్రయ్య, మహేందర్, రమేష్ ఉన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సునీల్

**తుర్కయంజాల్:** వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని 18వ వార్డు కౌన్సిలర్ కాకుమాను సునీల్ తెలిపారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని భవానీపురం కాలనీలో రూ.12 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామయ్య, సుధాకర్, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### గురువులకు సన్మానం



ఉపాధ్యాయులతో లయన్స్ క్లబ్ సభ్యులు

**తుర్కయంజాల్:** ప్రతి ఒక్కరికి విద్యాబుద్ధులను నేర్పించి, అజ్ఞానపు చీకట్లను తొలగించిన గురువులను స్మరించుకోవడం సంతోషకరమైన విషయం అని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, రాగన్నగూడ అధ్యక్షులు దాసరి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన రాగన్నగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్మటి వెంకట్ రెడ్డి, సామ అల్వాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల



మాదాయిపల్లిలో వంటకాల ప్రదర్శన

**తలకొండపల్లి:** పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. పోషక మాసోత్సావాన్ని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని మాదాయిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, తల్లులు, కిషోర బాలికలకు అదనపు పోషక ఆహారం ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ పద్మ తక్కువ ఖర్చుతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రొటీన్లతో కూడిన పదార్థాలతో వంటకాలు చేసి ప్రదర్శించారు.

### పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

ఉప సర్పంచ్ అనిల్

**తలకొండపల్లి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీఓ రఘుతో కలిసి ఉప సర్పంచ్ పర్యటించారు. మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా అనిల్, ఎంపీఓలు నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఈగలు, దోమలు వృద్ధిచెందకుండా గుంతలల్లో ఆయిల్ బాల్స్ వేశారు. మందును పిచికారీ చేశారు. కార్యదర్శి రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్ కార్యవర్గంలో పలువురికి చోటు

**ఇబ్రహీంపట్నం:** ఆదిబట్ల మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ కార్యవర్గంలో పలువురికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అవకాశం కల్పించినట్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ముఖ్య ప్రచార కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, మరియపురం వార్డు అధ్యక్షుడిగా జయరాజ్‌కుమార్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు



బోనమెత్తిన యువతి

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో బుధవారం సాయంత్రం పూసల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పట్టణంలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, యువతీ యువకుల సందడి ఆకట్టుకుంది. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ వార్డు సభ్యులు పూసల సత్యం, పూసల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు నారాయణ, భాస్కర్, సత్యం, పరమేశ్, వెంకటేశ్, మోహన్, నరేందర్, రాములు, ఉషా, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలను జయప్రదం చేద్దాం



కడ్తాల్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్**

**కడ్తాల్:** మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి నిర్వహించే బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్ కోరారు. బుధవారం స్థానిక పోచమ్మ తల్లి ఆలయం వద్ద బోనాల ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రాంచంద్రనాయక్, కార్తీక్, మాజీ సర్పంచ్ బీచ్యానాయక్, వార్డుసభ్యులు నరేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పాండుయాదవ్, శేఖర్‌రెడ్డి, నర్సింహ, శ్రీశైలం, రాములు, శంకరయ్య, దశరథ్, రవి, వెంకటేశ్, భానుకిరణ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

**ఉత్సవాలకు రండి..**

**ఆమనగల్లు:** కడ్తాల మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి నిర్వహించే బోనాల వేడుకలకు రావాల్సిందిగా ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లును ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ వెంకటేశ్వర్లును ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానపత్రిక అందించారు. మండల గౌడసంఘం అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు చేగూరి రాములు, కార్తీక్, రవి తదితరులు ఉన్నారు.

### నేడు భారత్ జోడో పాదయాత్ర

**కడ్తాల్:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కడ్తాల్‌లో భారత్ జోడో పాదయాత్ర నిర్వహిస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### 8న ఉచిత వైద్యశిబిరం

**ఆమనగల్లు:** కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ నర్సింగ్‌హోం ఆవరణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం(గుండె సంబంధిత వ్యాధులు) నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటుఅవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఈకో తదితర పరీక్షలు చేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పంటల పరిశీలన

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం సింగంపల్లి, పోలెపల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను బుధవారం మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి పరిశీలించారు. అధిక దిగుబడులకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివతేజ, రైతులు లక్ష్మమ్మ, అంతమ్మ, అడివమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పురుషోత్తం

**ఐడంగ్‌పేట్:** ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ పేషీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడి 9 ఏళ్లు దాటినా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వెంటనే హామీలన్నీ నెరవేర్చాలన్నారు.

# పరిహారం ఇప్పించండి

**అదనపు కలెక్టర్‌కు వడగళ్ల బాధితుల వినతి**



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, బాధితులు

**యాచారం:** మంతన్‌గౌరెల్లిలో నాలుగు నెలల కింద వడగళ్ల వాన పడి నష్టపోయిన ప్రజలకు ఇప్పటివరకు పరిహారం అందించలేదని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంతన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామాల బాధితులతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాలుగు నెలల కిందట మంతన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామాల్లో కురసిన వడగళ్ల వానకు సుమారు 610 రేకుల ఇళ్లకు రంధ్రాలు పడ్డాయిని.. ఎమ్మెల్యే, ఆర్డీఓ, తహసీల్దార్ వచ్చి రెండు, మూడు రోజుల్లో పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నెలలు గడుస్తున్నా పరిహారం ఊసే లేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యం కింద మంతన్‌గౌరెల్లి, కేసీతండాల్లోని బాధిత కుటుంబాలకు గృహలక్ష్మీ పథకం కింద ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. త్వరలో బాధిత కుటుంబాలకు పరిహారం అందజేస్తామని, ఆందోళన చెందవద్దని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, గ్రామస్తులు కడారి యాదయ్య, రామచారి, విజయ, చందర్, రాములు, సీతారాం, శ్రీను, అఖిల్ తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**తలకొండపల్లి:** మండల పరిధిలోని పడకల్‌కు చెందిన రాజు ఇటీవల మృతిచెందాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా రూ.3000 ట్రస్టు సభ్యులచే మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. అలాగే స్థానిక నాయకుడు శ్రీశైలం రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు రమేష్, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, శేఖర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచ్ సహాయం..**

**కడ్తాల్:** మండల కేంద్రానికి చెందిన మహ్మద్ యాసీన్ కుమారుడు సలీమ్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ రూ.3వేలు సాయం అందించారు. పరామర్శించిన వారిలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు జహంగీర్ అలీ, కృష్ణ, నాగార్జున, బాలరాజ్, ఫరీద్ తదితరులు ఉన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు



యాచారం: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంపీపీ సుకన్య

**ఇబ్రహీంపట్నం:** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొగాకు సురేష్‌ను బుధవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి రమేష్‌రాజు, వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, జిల్లా అధ్యక్షులు పట్నంశెట్టి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఆనందప్ప, సభ్యులు కుమార్, పవన్, యాదప్ప.. సురేష్‌ను ఘనంగా సత్కారించారు.

**అంకితభావంతో పనిచేయాలి..**

**యాచారం:** అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన యాచారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దేవదాస్ (పీడీ టీచర్), ఆనంద్ జోసఫ్(ఎస్‌ఏ)ను బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎల్లమ్మ కల్యాణోత్సవం

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ 40వ వార్షిక కల్యాణోత్సవాలు ముగిసాయి. బుధవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, కానుకులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఏఈ శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



యాచారం: మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డిని సన్మానించిన నేతలు

**కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి**

**యాచారం:** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లాగా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. పార్టీ శ్రేణులు కష్టపడితే భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, అమృతా సాగర్, మాధవి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, జగదీష్ రావు, మల్లేష్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌దే గెలుపు..**

**తలకొండపల్లి:** ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలుపించేందుకు సిద్ధంగా ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో 90 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్**



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**తుర్కయంజాల్:** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఐఆర్ (భృతి) కల్పించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ సీ.హెచ్.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్‌డ్ పే, తదితర సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలను కేటగిరీలవారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యాక్రమాన్ని చేపట్టనున్నామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్లనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాసు, కార్మికులు.. నగేష్, యూనియన్ నాయకులు నవీన్‌కుమార్, యాదగిరి, ప్రకాష్ కారత్, పి.జగన్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసరాల ధరలు తగ్గించాలి



నక్కర్తమేడిపల్లి ప్రధాన రోడ్డుపై ధర్నా చేపట్టిన సీపీఎం నాయకులు

**నక్కర్తమేడిపల్లిలో సీపీఎం నేతల ధర్నా**

**యాచారం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తు బుధవారం నక్కర్తమేడిపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలను తగ్గించకుండా కొత్త, కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నామని ప్రలోభాలకు గురి చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుమ్మక్కై ప్రజలను ఇబ్బందులపాలు చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ సర్కార్ మరో మారు ఎన్నికల్లో అమలుగాని హామీలిచ్చి గెలువాలని చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాజర్, యాదయ్య, కుమార్, పెంటయ్య, భూషణ్, జహంగీర్, గడ్డం యాదగిరి, వెంకటేష్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమి వేడుకలను కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులు కృష్ణుడు, రాధిక వేషధారణలో అలరించారు. వారి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: ఉట్టి కొడుతున్న కృష్ణుడు



చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



ఇబ్రహీంపట్నం: కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు



తలకొండపల్లి: డోలారోహణ వేడుక



తుర్కయంజాల్: కృష్ణుడి వేషధారణలో చిన్నారి



శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు